

# చివరి ఉత్తరం

వి. వెంకట్రావు

అందమైన మట్టితో చేసిన ఆకృతి, రంగులతో కనువిందు చేస్తుంది. చూపరులకు ఆనందం కలిగించే ఆ ఆకృతిలో లోపల చాలా పగుళ్ళున్నాయి. ఏ కుండపోత వర్షానికో తడిసి ముద్దయి పోవచ్చు. ఉధృతమైన గాలికి పగిలిపోనూవచ్చు. తీవ్రమైన ఎండకు మరింత బీటవారి పోవచ్చు. లేదా నిండు నూరేళ్ల మనుగడ సాగించనూవచ్చు.

బద్దలవడానికి లక్షకారణాలు వున్నట్లుగానే, నిలిచి వుండడానికి లక్ష కార ణాలు వున్నాయి.

ఉత్తరం చదవడం పూర్తి చేసి మడత పక్కన పడేశాడు.

ఊహించని ఈ సంఘటన నుండి ఇంకా తేరుకోలేకపోతున్నాడు. కళ్లు ఎరుపు రంగులోకి మారి చాలా సేపయింది. ముఖం అంతా ఉబ్బిపోయింది.

హూ...టీ పెట్టుకోవడం చాతకాదట. ఎంత మాట అంది. అదీ చూద్దాం...బయటకు వెళ్లి డబ్బులు పారేస్తే కావలసినంత టీ దొరుకుతుంది. ఈ మాత్రం దానికి అంత పొగరా...నిజమే! కానీ ఎక్కడకి వెళ్లాలి. ఇంటికి ఫర్లాంగు దూరంలో కానీ హోటల్ లేదు. అంత దూరం వెళ్తే కానీ టీ దొరకదు. అంత దూరం నడిచి వెళ్లాలి.

బైక్ వుంటే బాగుండును. రోజూ వెళ్లి వచ్చేవాడిని.

అమ్మో! రోజూనా, ఎంత బైక్ వుంటే మాత్రం. రోజూ ఎంతని వెళ్లగలం. బోలెడంత పెట్రోల్ ఖర్చు. ఇదంతా లెక్కవేసుకుంటే నెలకి ఎంత అవుతుంది? బండి వున్నా అయ్యే పని కాదు.

లాభం లేదు. నడిచే వెళ్లాలి. నడక ఆరోగ్యానికి మంచిది కూడాను. అయినా రోజూ నడిచి వెళ్లడం అంటే అదీ కష్టమే.

ఉదయాన్నే లేచిన వెంటనే బ్రష్ చేసేసి చాలా ఆనందంగా షేవ్ చేసుకొని చల్లగాలి పీలుస్తుంటే, పేపరు అందుకొని ఒక్కొక్క వార్తా చదువుతుంటే...వేడివేడిగా పొగలు కక్కుతూ భార్యామణి టీ అందిస్తుంటే... ఆ ఆనందమే వేరు.

నిన్నటి వరకూ అలాంటి ఆనందాన్నే పొందాను. ఇంతలోనే ఏంవచ్చిందో, ఏవేవో ఉత్తరంలో రాసిందిగా.

అయినా ఉత్తరంలో రాసిందేమిటి? టీ పెట్టుకోవడం కూడా చేతకాని వాడివి అంటూ అంత నిర్భయంగా రాసి పారేసింది.

టీ పెట్టుకొని చూపించాలి. అంతేకాదు. టీ నీకన్నా నేను బాగా పెట్టగలను అని నిరూపించాలి. నిరూపించాలంటే టీ పెట్టాలి. అనుకుంటూ వంటగదిలోకి వెళ్లాడు. చిన్న తపేళా తీసుకొని గ్లాసుడు నీళ్లు పోశాడు. స్టవ్ వెలిగించడం ఎలా? నాబ్ ఎడమ వైపు తిప్పాలా? కుడివైపు తిప్పాలా? కుడి ఎడమ అయితేపొరపాటు లేదోయ్ పాట జ్ఞాపకం వచ్చింది. పొరపాటు లేకపోవడం ఏమిటి? ఇంకేమైనా వుందా? గ్యాస్ లీకయిపోదూ...కుడి వైపు తిప్పాడు గాని తిరగలేదు. లేదు..లేదు.. ఎడమవైపుకి తిప్పేసరికి చిన్నగా శబ్దం చేస్తూ గ్యాస్ రాసాగింది.

అమ్మబాబోయ్! లైటర్ ఏదీ? వెంటనే కట్టేశాడు. ఇంకేమైనా వుందా? పెద్ద ప్రమాదం జరిగిపోవలసిందే.

లైటర్ ముందే పట్టుకోవాలని తెలిసింది. అనుభవం మీద అన్నీ అర్థం అవుతాయి.

ఒక చేత్తో లైటర్ పట్టుకొని, ఈసారి తిప్పాడు. మళ్లీ చిన్నగా శబ్దం. టక్కుమని లైటర్ వెలిగించాడు. మంట వచ్చింది.

హమ్మయ్యా! ఓస్ ఈ మాత్రం దానికేనా...క్రమంగా నీళ్లు మరుగుతున్నాయి. టీ పొడి ముందే వెయ్యాలా? నీళ్లు మరిగిన తర్వాత వెయ్యాలా? సందేహం... చూద్దాం. మరుగుతున్నప్పుడు వేసేస్తే? వేసేసాడు. టీ మరుగుతూ మంచి వాసన వస్తోంది. గ్లాసుడుపాలు కలిపాడు.

ఫర్వాలేదు టీ పెట్టుకోవడం వచ్చేసినట్లే...అయినా ఎంత ప్రయాస

అది సరే! ఏదో ఒక సారంటే టీ పెట్టుకుంటాం. మరి రోజూ సంగతి. రోజూ ఇంత ప్రయాసపడాలా? ఇంత ప్రయాస 'ప్రియ'పడేదా? పడకుండా ఎలా వుంటుంది? పడకుండా పొగలు కక్కుతున్న టీ గ్లాసు నా ముందుకు ఎలా వస్తుంది? అలవాటయిపోతే అంత కష్టం అనిపించదనుకుంటాను.

ఒక్క టీ సంగతే ఇలా వుంటే... ఇంట్లో మిగతా పని మాటేమిటి?

రోజంతా ఇంత పనయితే ఎలా? ఎలా ఏం వుంది? అలవాటయిపోతుంది.

ఏం... అలవాటయిపోవడం? ఇంత పని నేను రోజంతా చేస్తూ కూర్చుంటే మరి ఆఫీసో? ఆఫీసు సంగతి? అదెవడు చేస్తాడు? అదీ.. ఇదీ రెండు చెయ్యాలంటే కష్టమే.

ప్రియ రాసిన ఉత్తరం వెక్కిరిస్తున్నట్లుగా ఎదురుగా కనిపిస్తుంది. ఇంకా చింపి పారేయ్యకుండా ఎదురుగా ఎందుకు? చింపేస్తే ఏం అవుతుంది? అందులోని విషయాలు మాయం అయిపోతాయా? గుండెల్లో ఎవరో కత్తి పెట్టి పొడుస్తున్నట్టుగా వుంది. ఎవరో కాదు ప్రియే ఆ ఉత్తరంలోని అక్షరాల ద్వారా పొడుస్తోంది.

ఇంటి పనయితే ఏదో కష్టపడి నాలుగు రోజులు తిప్పలు పడినా నేర్చుకోవచ్చు. మగవాళ్లు ఎంత మంది నేర్చుకోవడం లేదు? కానీ ఆడవాళ్ల మాటేమిటి?

మగవాళ్లు ఇంటి పని నేర్చుకున్నట్లు ఆడవాళ్లు ఆఫీసు పని నేర్చుకోగలరా?

ఊహూ..వాళ్ల వల్ల కాదు. ఆఫీసు పనిచెయ్యాలంటే తెలివితేటలుండాలి. ఫైళ్లు, లెటర్సు డిక్టేషనూ ఇంకా ఎన్నని...అవన్నీ చేయ్యగలరా?

ఇంట్లో పనయితే బండపనీ... ఎవ్వరైనా నేర్చుకోవచ్చు.

ఇలా ఆలోచిస్తున్నాను కానీ...కొంతమంది ఆడవాళ్లు కూడా ఆఫీసుల్లో పని చేయడం లేదా? ఎక్కడో ఎందుకు? మా ఆఫీసులోనే వున్నారు ఆడవాళ్లు. ఒక రకంగా ఆలోచిస్తే ఉత్తరంలో ప్రియ రాసినదంతా నిజమేనని అనిపిస్తుంది.

కుర్చీలో అసహనంగా కూర్చున్నాడు. ఏమీ తోచడం లేదు. మనసంతా ఏమీ బాగాలేదు. ప్రియ రాసిన ఉత్తరం వెక్కిరిస్తున్నట్లుగా ఎదురుగా కనిపిస్తుంది. ఇంకా చింపి పారేయ్యకుండా ఎదురుగా ఎందుకు?

చింపేస్తే ఏం అవుతుంది? అందులోని విషయాలు మాయం అయిపోతాయా? గుండెల్లో ఎవరో కత్తిపెట్టి పొడుస్తున్నట్టుగా వుంది. ఎవరో కాదు ప్రియే ఆ ఉత్తరంలోని అక్షరాల ద్వారా పొడుస్తోంది.

తను ఎవరు? అందరి లాంటి మామూలు భర్తే కదా? వేళాకోళాలు, హాస్యాలు ఎన్ని సంసారాల్లో వుండవు?

మళ్లీ ఒక్కసారి తీసి చదవసాగాడు.

ప్రకాష్!

ఈ ఉత్తరం ఆసాంతం చదవండి. నా చేతిరాత సరిగ్గా అర్థం కాకపోవచ్చు. చాలా తప్పులు దొర్లవచ్చు. అయినా భావం అర్థం అయితే చాలు.

ఒకప్పుడు నా చేతి రాత ఎంతో బాగుండేది. పెళ్లికి ముందు కాగితం మీద అక్షరాలు ముత్యాలు పేర్చినట్లుగా వుండేవి. పరీక్షల్లో నా ఆన్సర్ షీట్ చూసి, మా టీచర్లు నువ్వు జవాబులు తప్పురాసినా ఇంటు మార్కులు వెయ్యబుద్ధికాదు అనే వాళ్లు.

పెళ్లయిన ఈ పదిహేను సంవత్సరాల కాలం ఎందుకిలా తయారయ్యింది. నా చేతిరాత, నా తలరాత లాగే అక్షరాలు తడబడుతున్నాయి. ఒత్తులూ, దీర్ఘాలు అన్ని తప్పుగానే వస్తున్నాయని నాకే సందేహంగా వుంది.

భాషను కూడా మరిచిపోయేటంతగా ఈ సంసారం బలి తీసుకుంది. నన్ను నేను మరిచిపోయాను. నా ఉనికిని, నా ఆస్థిత్వాన్ని అన్నింటినీ కోల్పొయ్యేలాగా తయారయ్యాను.

ఇంతకీ నాకు దక్కిన ప్రతిఫలం ఏమిటి? తిట్లూ, శాపనార్థాలు ఇదేనా? ఇక్కడ నాకంటూ గుర్తింపు వుందా? అసలు నేను మనిషినేనా? నాకే సందేహంగా వుంది.

ఈ ఇంట్లో స్విచ్ నొక్కితే ఫ్యాన్ తిరిగినట్లు, నేను పనులన్నీ చేసుకుపోతున్నాను. ఎప్పుడైనా ఎవరినైనా ఆ ఫ్యాన్‌ని పట్టుకొని నోటికి వచ్చినట్లు తిడుతుంటే, ఆ ఫ్యాన్ ఏమైనా పట్టించుకుంటుందా? ఎన్ని తిట్టినా తన మానాన తను అందరికీ చల్లని గాలిని సరఫరా చేస్తూనే వుంటుంది. నా జీవితమూ అంతే...

ఇన్ని సంవత్సరాలు అలాగే బ్రతికాను. ఒక యంత్రంతో నన్ను నేను పోల్చుకుంటున్నాను కదా? ఇన్నాళ్లు కరెక్ట్. ఇక పై కాదు.

నిన్న మీరేమన్నారు. ఇంకా మీరు అని సంబోధిస్తున్నందుకు నాకు సిగ్గు లేదనుకోవాలి. నిన్న మీరేమన్నారు కాదు...నిన్న నువ్వేమన్నావు?

ఈ ఇల్లు నాది. నువ్వెవర్తివే. మునిసిపాలిటీ ఇంటి పన్ను కట్టడానికి నీకు ఏం అధికారం వుంది? నా ఇల్లు, నా ఇష్టం వచ్చినప్పుడు కడతాను. లేనిపోని పెత్తనాలు చెలాయించకు. నోరుమూసుకొని పడివుండు అనలేదు.

అవును! ఈ ఇల్లు నీదే. చట్టప్రకారం నీదే. చట్టాలు నీదేననే చెబుతాయి. చట్టాలు ఏ ఇంట్లోకి తొంగి చూడవు కదా? అక్కడ జరుగుతున్నదేమిటో అని.

కానీ ఈ పదిహేనేళ్ల కాలం ఈ ఇంటికి నేనెంత చేసాను. ఈ ఇంట్లోని ప్రతి అణువు తోటి నాకు సంబంధం వుంది. కాపురానికి వచ్చింది లగాయితూ గోడల్లో గోడలాగా, తలుపుల్లో తలుపులాగా ఈ ఇంట్లో నేను ఒక భాగమైపోయాను.

ఈ ఇంటికి గచ్చులూడి పోయినా, గోడలకి పెచ్చులూడిపోయినా తాపీ మేస్త్రీ లాగా సిమెంటు పనిచేసాను. ఇంటి కాలువలో చెత్త నిలబడిపోతే కర్రపట్టుకొని

పాకీ దానిలాగా మొత్తం శుభ్రం చేసాను.

అదొక్కటేనా? ఎన్నెన్ని చేయలేదు. ఇది మన ఇల్లు. మనం చేయకపోతే ఎవరు చేస్తారు? అనే భావం నా మనసులో ఇంకి పోవడం చేత మన మధ్య తరగతి రాబడిని దృష్టిలో వుంచుకొని మన ఆర్థిక ఇబ్బందులకు ఎడ్జెస్ట్ కావాలని ఎన్ని చేయలేదు. అవేమైనా గుర్తున్నాయా? వాటిని ఏనాడైనా గమనించావా? చేస్తున్న మనిషి చేత చేయించుకున్న కొద్దీ చేయించుకోవాలని అనిపిస్తుంది నీ లాంటి వాళ్లకు. ఎంత బాధనైనా భరిస్తాను. ఎంత పనైనా చేస్తాను.కానీ ఇది మన ఇల్లు. మనకోసమే మనం చేసుకుంటున్నాము.

కానీ ఈనాడు దాన్ని వేళ్లతో సహా బయటకు పారవేసే శక్తి నాకు నేనే ఏర్పాటు చేసుకున్నాను.

ఎక్కడి నుంచి ఈ ధైర్యం వచ్చిందో నాకే తెలియదు. మనిషి శరీరంలో రెసిస్టెన్స్ వుంటుంది. ఆరోగ్య నిరోధక శక్తి లేకపోతే ఏ శరీరమూ ఈ భూమ్మీద సంచరించలేదు. ఈ మనసుకి కూడా రెసిస్టెన్స్ కావాలి. క్రిమికీటకాలని దరిచేరనివ్వని వ్యాధి నిరోధక శక్తి కావాలి.

ఏదో ఒక రోజు బ్రహ్మాండం బద్దలయినట్లు, లావా ఒక్కసారి ఎగదన్నుకు వస్తుంది.

లోకానికి అనిపించవచ్చు. ఈ ఇల్లు నాదన్నంత మాత్రాన ఇల్లొదిలి పోవాలా? అని కానీ వాళ్లకు తెలియదు. చివరగా వచ్చిన ఒక్కమాటను పట్టుకుంటారు. ఈ కారణం వెనుక ఎన్ని వందల, వేల మాటల తూటాలు దాగి వున్నాయో, సంసారాల్లో ఎన్నెన్ని కారణాలు వుంటాయో అనుభవించిన వాళ్లకే తెలుస్తుంది.

బాధ పెట్టే వాళ్లు ఎప్పుడూ తేలిగ్గానే వుంటారు

బాధపడే వాళ్లకి తెలుస్తుంది అసలు వాస్తవం ఏమిటో...

ఎప్పుడైనా నా పరిస్థితుల్లో వుండి ఒక్కసారి ఆలోచించు. ఎన్నెన్ని మాటలు అనేవాడివో. అవి చిన్న మాటలుగా, చిన్న హాస్యాలుగా నీకు అనిపించవచ్చు. కానీ నా స్థానంలో వుండి ఆలోచించు. నీకే కాదు ఎవరికైనా ఆ పరిస్థితుల్లో నేను వుంటే ఎలా ప్రవర్తిస్తాను అని అనుకుంటే అప్పుడు తెలుస్తుంది. ఆ మాటల వలన అవతలి వాళ్లు ఎంత బాధ పడ్డారో..

ఒకసారి మా చెల్లెలు ఇంటికి వస్తే దానితో... ' ఇంక నీకు వేరే సంబంధాలు ఎందుకు? నన్నే చేసుకోకూడదా? అక్కా చెల్లెళ్లు ఇద్దరూ ఒకే ఇంటిలో వుండవచ్చు కదా! మీ అక్కకి ఎలాగూ పిల్లలు పుట్టరు' అని.

ఆనాడెంత బాధపడ్డానో... భగవంతుడు ఎక్కడైనా వుంటే అతనికే తెలియాలి.

నాకు పిల్లలు పుట్టరని నిర్ధారణ అయ్యిందా? ఏనాడైనా డాక్టరుకి చూపించావా? మన ఇద్దరిలో ఎవరిలో లోపం వుందో తెలుసుకోకుండానే ఆ మాట అనేసావు. నిజానికి డాక్టరు దగ్గరకు వెళితే నీలోనే లోపం వుందని అంటారని నీకు భయం. ఆ భయం ఉండబట్టే ఏనాడు డాక్టరు దగ్గరకి వెళదాం అని నువ్వు అనలేదు. అదేదో నిర్ధారణ కాకుండా మరదలితో ఏమిటీ ఈ హాస్యాలు. నిర్ధారణ అయితే మాత్రం అలా అనవచ్చా.

అలాంటి హాస్యం నేను ఆడితే నువ్వేమయిపోతావు. ఒక్కసారి ఆలోచించు.

మీ తమ్ముడు కానీ తమ్ముడి వరస అయ్యే వాళ్లు గానీ ఇంటికి వస్తే పై సంభాషణ నేను అన్నాననుకో ఆ సంభాషణ ఎలా వుంటుందో ఊహించి రాయానా? ఒక్కసారి చదువు.

'నీకు వేరే సంబంధాలెందుకు నన్ను చేసుకోకూడదా? అన్నా, తమ్ముడు ఒకే ఇంట్లో వుంటారు. మీ అన్నయ్య ద్వారా ఎలాగూ పిల్లలు పుట్టరు' ఇలా అన్నానే అనుకో. ఆ మాటలకు ఎందులోనన్నా పడిచావాలి. అంతకన్నా వేరే దారి వుండదు. ఆశ్చర్యం! ఆ మాటలు నాకే అసహ్యంగా వున్నాయి. ఎందుకు అసహ్యంగా వున్నాయంటే, అలాంటి వూహే నేను భరించలేను గాబట్టి. అలాంటి మాటలకు సమాజంలో స్థానం లేదు. నలుగురు నన్నే అంటారు. మగవాడు హాస్యాలాడితే ఆడతాడు. అని మీకు జన్మహక్కయినట్లు.


మరి నేనన్నది హాస్యానికే కదా!

హాస్యానికైతే మాత్రం అవేం మాటలు అనదూ లోకం... మరి లోకానికి న్యాయం ఎక్కడుంది. ప్రతి సందర్భంలోనూ ఇలాగే ఆలోచించు.

ఒకసారి గుర్తుందా? ఇద్దరం సినిమాకి వెళ్లివస్తున్నాం. ఎవరో ఆడమనిషి వెళుతుంటే నాతో ఏమన్నావు? 'ఇలాంటి ఆడదానితో ఒక్కసారి...' అంటూ తర్వాత మాటలు రాయడానికి వీలులేని మాటలన్నావు. ఎంత ధైర్యం... ఎంత సిగ్గులేని తనం.

ఆ మాటలే నేనంటే...' ఇలాంటి కుర్రవాడితో ఒక్కసారి....' అనవచ్చా. దీనికి ఒప్పుకుంటావా? ఎందుకు ప్రతిసారీ ఇలాంటి సంభాషణతో పోల్చుతున్నానో తెలుసా?

మానసిక హింస అంటే ఏమిటో నీకు తెలియాలి.



## బాతింగ్ బ్యూటీ

కాస్మాటిక్స్ వాడితే బ్యూటీనెస్ పెరుగుతుందనేది చాలా మంది నమ్మకం. కానీ స్నానం చేయడం వల్లనే అందం పెరుగుతుందని కొంతమంది వాదన. ప్రముఖ స్కిన్ స్పెషలిస్ట్ ఆంథోని ముండే.. ఎక్కువసేపు మంచినీటి స్నానం చేయడం వల్లనే యవ్వనం కళకళలాడుతుందని అంటున్నారు. అదీ నిజమే.. సంతృప్తిగా స్నానం చేయడం వల్ల ఆకలి, నిద్రలు కూడా బాగా వుంటాయని, అందులోనూ మూలికలతో కలిసిన నీళ్లతో స్నానం చేయడం వలన చర్మం నిగనిగలాడుతూ వుంటుందని చెబుతున్నారు. నెలరోజుల పాటు రాసిన క్రీములకు సమానం ఒక్కరోజు చేసే స్నానం. అందుకే బాతింగ్ బ్యూటీ ఈజ్ న్యాచురల్ బ్యూటీ అంటారు!

మాటలకే వెళ్లిపోవాలా? అని నీకు కానీ, తవ్వకాల్లో దొరికిన నీలాంటి మనుషులకు కానీ అనిపించవచ్చు. తన్నిన వాళ్లు, కిరసనాయిలు పోసి కాల్చి చంపిన వాళ్లు వున్నారు లోకంలో. అలాంటి వాళ్లతో పోల్చుకుంటే లోకంలో అందరూ మంచి వాళ్లే.

అలాంటి వాళ్ల దగ్గర పెళ్లాలు పడి వుండలేదు? అని నువ్వు అనుకోవచ్చు.

కానీ మనిషి శరీరంలో వ్యాధి నిరోధక శక్తి అందరికీ ఒకేలా వుండదు. కొందరు చిన్నపాటి రుగ్మతకి తట్టుకోలేరు. కొందరికి ఎంత బాధనైనా భరించగలిగే ఓర్మి వుంటుంది. కానీ ఎంత సహనానికైనా హద్దు వుంటుంది.

దానికి స్త్రీ సిగ్గుమాలినతనం లోనైతే ఇక చెప్పేదేం వుంది? జీవిత పర్యంతం వెయ్యినిలువల లోతుకు కూరుకుపోతుంది. నీలాంటి వాళ్లు అలాంటి వాళ్లతో నేపోల్చుకొంటారు.

కానీ లోకంలో ఇంకా ఆదర్శవంతులూ వున్నారు. భార్యా, భర్తల మధ్య ప్రేమా, అభిమానం, అనురాగం, వాత్సల్యం ఇంకా ఇలాంటి పదాలు చాలా...

అలాంటి వ్యక్తులతో పోల్చుకో...జీవితం అంటే ఏమిటో తెలుస్తుంది. 'స్వీట్ హోమ్'లో బుచ్చిబాబు ఎక్కడైనా ఎదురైతే అలాంటి వాళ్ల కాళ్ల మీద పడు. సిగ్గన్నా వస్తుంది. బుద్ధిన్నా వస్తుంది.

ఒకసారి గుర్తుందా? ఆ రాత్రి ఎనిమిదీ తొమ్మిది మధ్య ఆఫీసు నుండి చాలా చిరాకుగా అసహనంగా వచ్చావు. అప్పుడే కాఫీ ఇవ్వడం కాస్త ఆలస్యం అయిందని నన్ను నానా మాటలు అనడమే కాకుండా చెయ్యి చేసుకున్నావు కూడా. మౌనంగానే భరించాను.

ఆ బాధలోనే ఆ రాత్రి పక్కమీద ఒత్తిగిలి పడుకుంటే బలవంతంగా దగ్గరకు తీసుకున్నావు. నాకిష్టం లేదని చెప్పాను. వినిపించుకున్నావా? నా ఇష్టా ఇష్టాలతో ఏం పని? బలవంతంగా ఆక్రమించుకున్నావు. అసలు అది కలయికేనా? అందులో ఏమన్నా ఆనందం వుంటుందా? స్త్రీ పురుషులు సంతోషంగా, ఒకరి కళ్లలోకి ఒకరు చూసుకుంటూ తన్మయత్వంతో, తమకంతో పరవశించిపోతూ ఒకరిలో ఒకరు ఐక్యం కావడం కొండంత తృప్తినిస్తుంది.

మనలాంటి మధ్య తరగతి కుటుంబాల్లో, గాలీ, వెలుతురూ చొరబడని ఇరుకు గదుల్లో తప్పనిసరి పరిస్థితుల్లో కాళ్లుపూర్తిగా చాపితే ఎక్కడ ఏ సామాన్లు తగులుతాయోననే భయంతో ప్రైవసీ అనేది అందని ద్రాక్ష పండులా ఊరిస్తుంటే, ఏదో...అయిందని అనిపించుకోవడం కూడా నిజానికి తృప్తి వుండదు. అయినప్పటికీ భార్యాభర్తల మధ్య విభేధాలు లేనప్పుడు ఒకరికోసం ఒకరు, ఒకరి గురించి ఒకరు అనే ఆలోచనలు బలంగా వున్నప్పుడు, ఇద్దరి మధ్యా ప్రేమాభిమానాలు అపరిమితమైన స్థితిలో, ఇవన్నీ ఇబ్బందులుగానే వుండవు. వున్నంతలోనే ఆ రుచిని ఆస్వాదించవచ్చు.కానీ మన ఇద్దరి మధ్యా ఏది?

ఒక వ్యక్తి 'ఇష్టం లేదూ' అని చెపుతుంటే, పశువు కంటే హీనంగా ఆమె పై బడి ఆ 'క్రియ' ఏదో మొక్కుబడిగా తీర్చుకోవడానికి నీలాంటి పశువులు ప్రయత్నిస్తే అందులో నిజంగా తృప్తి వుంటుందా?

మనిషిని తిట్టో, కొట్టో కోరిక తీర్చుకోవడంలో పైశాచికత్వం నీకర్థం కాదు. స్త్రీ కళ్లల్లోని అసహ్యాన్ని నీవు కనిపెట్టలేదు. స్త్రీ భయంతోనూ, అసహ్యంతోనో శరీరాన్ని అప్పజెప్పితే, అందులోని ఆనందాన్ని ఆస్వాదించగలిగా వంటే నువ్వో శాడిస్టువి. హింసలో ఆనందాన్ని వెదికే నీచమైన లక్షణం నీ రక్తంతో ప్రవహిస్తుంది.

నువ్వు గమనించావో లేదో ఈ ఉత్తరం మధ్యలో నీటి చుక్కలు పడి అక్షరాలు చెదిరిపోయాయి. అవేమిటో తెలుసా కన్నీటి చుక్కలు.

నాకే ఆశ్చర్యంగా వుంది. నా కళ్లలో నుండి నీళ్లు వచ్చాయంటే, నీ మీది అసహ్యంతో, కోపంతో ఆనందంగా వెళ్లిపోతున్న నా కళ్ళ నుండి నీళ్లు రావడం ఏమిటి? సృష్టిలో ఇలా ఎక్కడైనా జరుగుతుందా? సంతోషపడే సందర్భాలలో కన్నీళ్లు వస్తాయా? నన్ను నేనే తర్కించుకున్నాను. చాలా సేపటికి కానీ ఆ ప్రశ్నకు సమాధానం దొరకలేదు. తెలిసింది అసలు విషయం.

ఆ కన్నీళ్లు నీ గురించి అణు మాత్రం కూడా కాదు.

ఈ ఇంటిని గురించే...నేను కాపరానికి వచ్చిన లగాయితూ ఈ ఇంటితోనే నా జీవితం పెనవేసుకుపోయింది. పదిహేనేళ్లుగా ఈ ఇంటితో వున్న అనుబంధం అది.

చాలాకాలం ఒక అద్దె ఇంటిలో వుండి వెళ్లిపోతున్నప్పుడు, చివరిసారిగా ఆ ఇంటితో వున్న అనుభవాలను నెమరువేసుకుంటాం. ఇన్నాళ్లు ఎండ నుండీ, వర్షం నుండీ మనల్ని కడుపులో పెట్టుకు దాచుకుందే, అని ఒక రకమైన ఆప్యాయతా, అభిమానం వుంటుందే అదే ఇది. అందుకే ఈ కన్నీళ్లు.

ఎంత ఆశ్చర్యం!

ఒక నిర్జీవ వస్తువు మీద వుండే ప్రేమ సజీవమైన నీ మీద ఎందుకు లేకపోయింది. ఆలోచించుకో. ఈ వుత్తరం ఆసాంతం చదివాక నీకొచ్చే మొదటి ప్రశ్న రేపటి నుండి ప్రియ ఎలా బ్రతుకుతుందని? నీ ఇంట్లో గొడ్డు చాకిరి చేసిన నాకు బతకడం పెద్ద కష్టం కాదు. నైతికంగా సమాజానికి సమాధానం చెప్పుకోగల ధైర్యం వుంటే చాలు. బ్రతకడం పెద్ద సమస్య కాదు. సమాజం ఏం అంటుందోననే భయంతోనే చాలా శాతం సంసారాల్లో ఆడవాళ్లు మౌనంగా ఎంతటి అసమానతలనైనా భరిస్తూ జీవితం వెళ్ల మారుస్తుంటారు. బయటకు అద్భుతంగా కనిపించే సంసారాల్లో కూడా లోపల ఎన్నెన్ని పగుళ్లు వుంటాయో లోపల వుండే వాళ్లకే తెలుస్తుంది.

చాలాకాలం ఒక అద్దె ఇంటిలో వుండి వెళ్లిపోతున్నప్పుడు, చివరిసారిగా ఆ ఇంటితో వున్న అనుభవాలను నెమరువేసుకుంటాం. ఇన్నాళ్లు ఎండ నుండీ, వర్షం నుండీ మనల్ని కడుపులో పెట్టుకు దాచుకుందే, అని ఒక రకమైన ఆప్యాయతా, అభిమానం వుంటుందే అదే ఇది. అందుకే ఈ కన్నీళ్లు. ఎంత ఆశ్చర్యం! ఒక నిర్జీవ వస్తువు మీద వుండే ప్రేమ సజీవమైన నీ మీద ఎందుకు లేకపోయింది. ఆలోచించుకో.

మగవాడి నుండి విడిపోయిన ఆడది చాలా తేలిగ్గా బ్రతకగలదు.

కానీ రేపటి నుండి నీ సంగతి...తెల్లవారి లేస్తే కనీసం టీ పెట్టుకోవడం కూడా చాతకాని వాడివి...రేపటి నుండి నీ పాట్లు కుక్కపాట్లే....

ఇట్లు
ప్రియ.

ఉత్తరాన్ని మడిచి టేబుల్‌పై పెట్టాడు. తల భారంగా అనిపించింది. తల వెనక్కి వాల్చి. పై కప్పుకేసి చూశాడు. ఇది నాలుగోసారి చదవడం. చదివిన ప్రతిసారీ కొత్తగానే వుంది.

ఏం చేయాలి?

మరో దాన్ని చేసుకుంటే అనే ఆలోచన వచ్చింది. ఇతరులనూ, స్త్రీలను గౌరవించడం చేతగాని కుసంస్కారులకు, మురికి హృదయాలకూ, మనసుల్లో, ఆలోచనల్లో మరో దాన్ని అనే పదాలే జ్ఞాపకం వస్తుంటాయి.

కొత్త పెళ్లాం, కొత్త మోజు బాగానే వుంటుంది అనుకున్నాడు. కానీ అది కూడా ఇలాగే ప్రవర్తిస్తే అప్పుడేం చేయాలి? మరో మనిషి కోసం చూడాలా? వచ్చే మనిషి మాత్రం బానిసలాగా పడి వుంటుందని గ్యారంటీ ఏమిటి?

కన్యాశుల్కంలోని గిరీశం లాగా లాభ,నష్టాలు బేరీజు వేసాడు.

ఎంత ఆలోచించినా ప్రియతో సామరస్యంగా వుండడమే బాగుందని అనిపించింది.

ఎలాగో ఒకలాగా బ్రతిమిలాడో ఏదో విధంగా తెచ్చుకోకపోతే ఇంటెడు పని ఎవడు చేస్తాడు?

ఇంటి పనులు ఒకటా, రెండా ఉదయం లేచిన తర్వాత టీ, స్నానానికి వేడి నీళ్లు, స్నానం అయిన వెంటనే డ్రాయరు, బనీను, లుంగీ ఆఫీసుకు వెళ్లే ముందు వేడి వేడి అన్నం, మధ్యాహ్నానికి కేరేజీ, ఇంకా ఇంటికి సంబంధించిన పనులు ఎన్నని? పని మనుషులను పెట్టుకుంటే మాత్రం ఒకరోజు వస్తారు. ఒక రోజు రారు.

అన్నిటికి మించి రాత్రి పక్కమీద సుఖం.

ఇవన్నీ తలుచుకుంటే గుండె బేజారెత్తిపోయింది.

ఏదో విధంగా రాజీ పడకపోతే, లేక రాజీపడినట్లు నటించకపోతే లాభం లేదు అనుకొని ప్రియ కోసం వెతుకులాటకి బయలుదేరాడు.

విడిపోవడానికి లక్షకారణాలు వున్నట్లే... కలిసి వుండడానికి లక్షకారణాలు వుంటాయి.

★